# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై ఈరోజు సమీక్ష నిర్వహించారు.
- అమరావతిని రాష్ట్ర శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ.. బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతిని కలసి మంత్రి నారా లోకేశ్, ఎంపీలు కృతజ్ఞతలు తెలియజేశారు.
- పేద కుటుంబాల విద్యుత్ ఖర్చు భారాన్ని తగ్గించడమే "ప్రధాన మంత్రి సూర్యఘర్" పథకం లక్ష్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.
- సింహాచలం చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత పరిశీలించారు.

==================

ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై సమీక్షించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం.. అనుమతుల సులభతరం... అనవసరపు పర్మిషన్ల నియంత్రణతో పాటు పలు అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ ముఖ్యమంత్రి ముందుంచారు. కార్యదర్శి ప్రతిపాదనలపై రాష్ట్ర ఉన్నతాధికారులతోనూ చంద్రబాబు నాయుడు చర్చించారు. 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపునకు తీసుకురావాలని వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సూచించారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలన్నారు. మే నెలాఖరు నాటికి డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలన్న చంద్రబాబు నాయుడు.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని ఆదేశించారు.

==================

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఎన్డీయే కూటమి ప్రభుత్వ పార్లమెంట్ సభ్యులు ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిని రాష్ట్ర శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ.. బిల్లుకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్రపతికి లోకేశ్, ఎన్డీయే ఎంపీలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో రాజధాని రైతులు, రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్రపతికి తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... అమరావతికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015లో శంకుస్థాపన చేశారని, మళ్ళీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి పనులు పునః ప్రారంభించారని రాష్ట్రపతికి వివరించారు. రాజధాని ఏర్పాటుకు 34 వేల ఎకరాల భూములను రైతులు అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

===================

పేద కుటుంబాల విద్యుత్ ఖర్చు భారాన్ని తగ్గించడమే `ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం` లక్ష్యమని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కొత్తవలస గ్రామంలో ఆమె ఈరోజు పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ పథకం అమలులో దేశంలోనే ముందంజలో ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ సిస్టమ్స్‌లను ఉచితంగా అందిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సుమారు 10 వేల సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

===================

లాజిస్టిక్ హబ్ గా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో ఎన్డీయే హయాంలో నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం జరగడంతో శ్రీకాకుళం జిల్లా కొంతమేర అభివృద్ధి చెందిందన్నారు. ఆ నాలుగు వరుసల జాతీయ రహదారిని.. ఆరు వరుసల జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మూలపేట పోర్ట్ తో పాటు, ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వచ్చాక జిల్లాలో వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

===================

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఊటాడ, యలమంచిలి గ్రామాల్లో 9 కోట్ల 22 లక్షల రూపాయలతో సీసీ రహదారులు, కమ్యూనిటీ హాల్, డ్రైన్ రక్షణ గోడల నిర్మాణ పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించే విధంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.

విరామం

===================

అమరావతి క్వాంటం హబ్‌లో తొలిసారిగా స్వదేశీ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ప్రారంభించనున్నారు. నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా తొలి కంప్యూటింగ్ వ్యవస్థను అమరావతిలో ఏర్పాటు చేయనున్నారు. గన్నవరంలో మేథాటవర్స్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్, 1ఎక్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్‌లు ఏర్పాటు కానున్నాయి. క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణలకు అవసరమైన

ఎకోసిస్టమ్‌ను ఈ నెల 14 నుంచి అందుబాటులోకి తేనున్నారు. వీటిని ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. అమరావతిలోని ఎస్.ఆర్.యం విశ్వవిద్యాలయంలో ప్రారంభించనున్న క్వాంటమ్ కంప్యూటర్.. దేశంలోనే మొదటి క్వాంటం కంప్యూటర్ కానుంది. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ సహకారంతో ఏర్పడుతున్న ఈ క్వాంటం కంప్యూటర్ తో.. దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించనుంది. తద్వారా క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యం కూడా అమరావతి క్వాంటం వ్యాలీకి దక్కనుంది.

==================

వికసిత్ భారత్ సాధనకు చట్ట సభల్లో మహిళల భాగస్వామ్యం అవసరమని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా తెలిపారు. విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయంలో "నారీ శక్తి వందన్ అధినియమ్-2023 తక్షణ అమలు"పై చర్చ కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ... మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చట్టపరమైన చర్యలు సమాజంలో సమానత్వాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా మహిళలకు రాజకీయ, సామాజిక రంగాలలో అవకాశాలు మెరుగవుతాయన్నారు.

==================

పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధి సూచికల్లో పురోగతి సాధిస్తూ.. జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న 112 ఆకాంక్షిత జిల్లాల పోటీలో పార్వతీపురం మన్యం జిల్లా నిర్ణీత గడువు కంటే మూడు రోజుల ముందుగానే లక్ష్యాలను చేరుకుందని తెలిపారు. టీకా కార్యక్రమాల్లో రాష్ట్రంలో మన్యం జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఐసీడీఎస్ పరిధిలో కూడా రాష్ట్ర సగటును మించి ప్రదర్శన కనబరుస్తోందని పేర్కొన్నారు. ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో నిర్ణయించిన అన్ని సూచికలను నూరు శాతం పూర్తి చేసి దేశంలోని మొదటి జిల్లాగా పార్వతీపురం మన్యం నిలిచిందన్నారు.

==================

సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి వారి చందనోత్సవం సందర్భంగా సింహగిరిపై ఏర్పాట్లను హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు పరిశీలించారు. ఈ నెల 20న సింహాచలంలో చందనోత్సవం జరగనున్నది. భక్తులకు మౌలిక వసతులు, పార్కింగ్ పై అధికారులతో మంత్రి చర్చించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, NDRF, SDRF బృందాలు ఆలయం వద్ద ఉండేలా చూడాలని మంత్రి అధికారులని ఆదేశించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. సామాన్య భక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుండి స్వామివారి దర్శనాలు ప్రారంభమవుతాయని, ఐదు గంటల తర్వాత అంతరాలయ దర్శనాలను నిలిపి వేస్తామని మంత్రి తెలిపారు.

==================

పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రాయితీని పొందాలంటే పన్ను బకాయి మొత్తం పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఈనెల 30 వరకు రాయితీ లభిస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఏప్రిల్ 30 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది.

==================

రాష్ట్రంలో ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. కడపలో ఈరోజు 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించారు. రేపు రాయలసీమ, కోస్తా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఎండల తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

===================

===================